క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు

అంబాజీపేట: మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించినట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. ఈ శిబిరాల్లో ఓటర్ జాబితాలో నమోదులు, మార్పులు, తొలగింపులతో పాటు నూతనంగా ఓటుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక శిబిరాలను రెండు రోజులు పాటు నిర్వహించామన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



రాకేష్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ నాయకులు

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న రాజోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కొంబత్తుల రాకేష్‌కు రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రూ.21,600 ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. విద్యార్థి ఇంటికి వెళ్లి ఈ సహాయాన్ని ఎంఈఓ మోకా వెంకన్నబాబు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పెయ్యల వీరభద్రరావు, మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, జిల్లా బాధ్యులు బత్తుల రమేష్‌బాబు, బయ్యా మోహనరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాదలాడ నుంచి పాదయాత్ర

మామిడికుదురు: రాజోలు మండలం పాదలాడ నుంచి అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయం వరకు గోవింద మాలధారులు ఆదివారం పాదయాత్ర చేశారు. పాదలాడలోని దత్తాత్రేయ పీఠానికి చెందిన 53 మంది గోవింద మాలధారులు తాటిపాక, మామిడికుదురు మీదుగా 15 కిలోమీటర్ల మేర గోవింద నామ శరణుఘోషతో పాదయాత్ర చేశారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. 14వ సారి గోవింద మాల వేశామని ఈ నెల 24న రాజోలు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకుని తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళతామని దత్తాత్రేయ సభ్యులు తెలిపారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

మామిడికుదురు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గ్రామంలో కొలువుదీరిన బాలాజీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో పలువురు దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి భాస్కరం ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, రామలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. లక్ష మారేడు దళాలతో స్వామి వారికి అర్చన చేశారు. నీరాజన మంత్రపుష్పం, సూర్య నమస్కారాలు, చండీ, రుద్ర హోమం ఘనంగా జరిపించారు.

సోమనాథేశ్వర స్వర్ణిమ రథయాత్ర

అంబాజీపేట: కార్తికమాసం సందర్భంగా సోమనాథేశ్వర జ్యోతిర్లింగ స్వర్ణిమ రథయాత్రకు అంబాజీపేటలో ఘనస్వాగతం లభించింది. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ మాట్లాడుతూ పరమాత్ముని దివ్య అవతరణ, కర్తవ్యాలను అందరికీ తెలియచేయాలనే శుభ సంకల్పంతో సోమనాథేశ్వర జ్యోతిర్లింగ రథయాత్రను గ్రామగ్రామానా నిర్వహిస్తున్నామన్నారు. నేటి సమాజంలో నైతిక విలువలు రోజురోజుకీ దిగజారి పోతున్నాయని వాటిని పరిరక్షించేందుకు, గీత జ్ఞాన, సహజయోగా శిక్షణ ద్వారా నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తొలుత స్వర్ణ రథయాత్రకు మహిళలు ఘనస్వాగతం పలికారు.

అయినవిల్లిలో భక్తుల సందడి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస రుద్రాభిషేకాలు జరిపారు. స్వామికి మహా నివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 177 మంది, పంచామృతాభిషేకాల్లో నలుగురు దంపతులు, లక్ష్మీగణపతి హోమంలో 29 మంది దంపతులు, ఐదుగురు స్వామివారికి ఉండ్రాళ్ల పూజ చేశారు. 28 మంది చిన్నారులకు తులాభారం, 86 మంది నూతన వాహన పూజ నిర్వహించారు. స్వామివారి అన్నదాన పథకంలో 4,500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.5,21,696 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

రైతు సేవలకు మంగళం

- ఆర్‌ఎస్‌కేల సేవలు అంతంతమాత్రం
- మూలనపడిన కియోస్క్‌లు
- సేవలు అందక రైతుల ఇబ్బందులు
- అధిక ధరలకు విత్తనాలు, ఎరువుల కొనుగోలు



గంటిలోని రైతు సేవా కేంద్రం



నిరుపయోగంగా మారిన కియోస్క్

కొత్తపేట: రైతు ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల సేవలకు నేటి కూటమి సర్కార్ మంగళం పాడేసింది. రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువుల ఏటీఎంలు నిరుపయోగంగా మారాయి. గ్రామ వ్యవసాయ సహాయకులను వ్యవసాయేతర పనులకు ఉపయోగించుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖల రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మార్కెటింగ్ సేవలు అన్నీ పారదర్శకంగా రైతుల ఇంటి ముంగిటకే అందించేలా ప్రతి సచివాలయ పరిధిలోనూ ఆర్‌బీకేల్లో కియోస్క్ (డిజిటల్ టచ్ స్క్రీన్ మెషీన్)లు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినా.. కియోస్క్‌లను మాత్రం నిరుపయోగంగా ఉంచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేసిన కియోస్క్‌లు మూలన పడేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలో గత ప్రభుత్వం 213 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రతి ఆర్‌బీకే (ప్రస్తుతం రైతు సేవా కేంద్రం)లో ఒక్కొక్కటి చొప్పున కియోస్క్‌లు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి వాటిని కొనుగోలు చేసింది. కియోస్క్‌లతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గర్లో ఉన్న మార్కెట్ వివరాలు తదితర అవసరమైన అన్ని సేవలు ఈ డిజిటల్ కియోస్క్‌ల ద్వారా పొందే అవకాశం ఉండేది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాలా అవగాహన కల్పించింది. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించారు. కూటమి ప్రభుత్వం 'కియోస్క్' సేవలపై నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లను వినియోగించడం లేదు. కనీసం ఎరువులను బుక్ చేసుకుకునేందుకు కూడా వినియోగించుకోకపోవడంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కొత్తపేట మండలంలో సుమారు 600 ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు ప్రైవేట్ డీలర్ వద్ద కొనుగోలు చేసిన ఒక కంపెనీ విత్తనాల్లో వేరే రకం విత్తనాలు (కేళీలు) కలసి పండాయి. దాంతో ఎకరానికి సుమారు 10 బస్తాలు నష్టం వస్తున్నట్టు బాధిత రైతులు తెలిపిన విషయం తెలిసిందే.

నియోజకవర్గం	రైతుసేవా కేంద్రాలు	కియోస్క్ మెషీన్లు
కొత్తపేట	87	87
పీ గన్నవరం	64	64
రాజోలు	62	62
మొత్తం	213	213

వీఏఏలకు వ్యవసాయేతర పనులు

ఇప్పుడు వ్యవసాయ శాఖ పనులు అనగా ధాన్యం కొనుగోలు, పంట కోత ప్రయోగాలు, రబీ (దాళ్వా) పంటకు రైతులను సిద్ధం చేయడం వంటి ముఖ్యమైన పనుల ఉండగా వ్యవసాయేతర పనులకు ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లు అంటించడం, ఇంటింటికీ తిరిగి ఉద్యోగులపై నిఘా కొరకు హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ చేయించడం, పింఛన్లు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలకు వాడుకుంటున్నారని వారు వాపోతున్నారు.

సేవలు పునరుద్ధరించాలి



నాడు రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ విధానంలో కియోస్క్ మెషీన్‌ల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ సేవలు తెలియజేసేవారు. అప్పటిలాగే ఇప్పుడు డిజిటల్ సేవలు పునరుద్ధరించాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో రైతులకు అందించాలి.

– భూపతిరాజు సత్యనారాయణరాజు, రైతు, గంటి

ఎరువులు అందించాలి



ఈ ప్రభుత్వంలో రైతు భరోసా లేదు. ఫ్రీ క్రాప్ ఇన్సురెన్స్ రబీ నుంచి తొలగించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించలేకపోయింది. విత్తనాలు, ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేశాం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తరహాలోనే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, అన్ని రకాల సేవలూ అందించాలి.

– దూనబోయిన లక్ష్మణరావు, రైతు, ఖండ్రిగ

ఆరెస్కేల ద్వారా సేవలు



రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఆర్‌బీకేలో కియోస్క్ ద్వారా ప్రధానంగా ఎరువులు సరఫరా చేశాం. నేటి ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా సొసైటీల ద్వారా ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకున్నాం. ఆ మేరకు సొసైటీలకు ఎరువుల లైసెన్స్‌లు ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ పర్యవేక్షణ ఉంటుంది. రైతులు ఏ విధమైన ఇబ్బందులు పడే పరిస్థితి ఉండదు.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

ముగ్గురు బాధితులకు రూ.25 వేల పంపిణీ



గొందిలో విద్యుత్ షాక్ బాధిత బాలికకు సాయం చేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

సఖినేటిపల్లి: మండలంలోని గొంది, కేశవదాసు పాలెం గ్రామాల్లో బాధితులు ముగ్గురికి ఆదివారం ఖతార్ వైఎస్సార్ సీపీ నాయకుడు, రామేశ్వరం ఎన్నారై దొండపాటి శశికిరణ్ మొత్తం రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు పై మొత్తాలను శశికిరణ్ తల్లి, సఖినేటిపల్లి జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా వారికి అందజేశారు. ఇందులో గొంది గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న బాలిక బర్రే దుర్గాభవానీకి రూ.10 వేలు, కేశవదాసుపాలెంలో బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్న దేవ ఉషారాణికి రూ.10 వేలు, అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడు లంక రమేష్‌కు రూ.5 వేల నగదును జెడ్పీటీసీ అన్నపూర్ణ వారి ఇళ్ల వద్ద అందించారు. వెంట కొల్లాబత్తుల చిట్టిబాబు, నల్లి రాజ్‌కుమార్, యెనుముల ఏసుబాబు, కొల్లాబత్తుల లాజర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు.. విగ్రహాలకు ముసుగు



కొత్తపేటలో టీడీపీ ఫ్లెక్సీ తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తపేట: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఆదివారం నుంచి అమలులోకి వచ్చింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి కోడ్ అమల్లోకి రాగా 9వ తేదీ వరకూ మండలంలో ఎక్కడా కోడ్ అమలుకు నోచుకోలేదు. ఎక్కడికక్కడ రాజకీయ పార్టీలు ముఖ్యంగా అధికార టీడీపీ కూటమి ప్రభుత్వ పాలకుల ఫొటోలతో ఫ్లెక్సీలను అధికారులు పట్టించుకోలేదు. దానిపై ఆదివారం 'సాక్షి'లో 'కొత్తపేటలో కోడ్ కొండెక్కింది' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దానిపై ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, ఇతర అధికారులు స్పందించారు. గత శుక్రవారమే ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, పొలిటికల్ ఫ్లెక్సీలు పెట్టిన వారిని ఫ్లెక్సీలు తొలగించమని విజ్ఞప్తి చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. వారు తొలగించకపోవడంతో ఆదివారం తొలగింపునకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఆ మేరకు గ్రామ పంచాయతీల సిబ్బందితో ఫ్లెక్సీలు తొలగింపు చేపట్టారు. విగ్రహాలకు ముసుగు వేశారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



మోరిపోడులో రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం మోరిపోడులో రూ.40 లక్షలతో మలికిపురం చొప్పలవారి వంతెన వద్ద నుంచి మోరిపోడు మీదుగా మోరి పీహెచ్‌సీ వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మోరిపోడు రివర్‌సైడ్ స్కూల్ వద్ద మండలంలో వివిధ గ్రామాల రైతులకు ఎమ్మెల్యే సబ్సిడీపై దాళ్వా వరి విత్తనాల బ్యాగ్‌ల పంపిణీ చేశారు. కాగా 30 కేజీల బ్యాగ్ ఒక్కింటికీ సబ్సిడీ పోను రూ.1044కు అందజేస్తున్నట్టు ఏవో పీవీ నరసింహారావు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీలు వీరా మల్లిబాబు, మేడిచర్ల సత్యవాణి, ఎంపీటీసీ బళ్ల సుభాషిణి, గుబ్బల ఫణి, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

సఖినేటిపల్లి: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, క్రియాశీలక సభ్యత్వ ప్రముఖ్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. ఆదివారం అంతర్వేదిపాలెంలో దంతులూరి సీతారామరాజు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నగేష్ మాట్లాడుతూ, ప్రజల స్పందనను బట్టి కార్యకర్తలు, నాయకులు నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని కోరారు. అంతర్వేది పుణ్యక్షేత్రానికి దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మార్గం తెలిపే విధంగా మండలాల సరిహద్దులలో ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఉత్సవాలకు ప్రత్యేక దర్శనం రూ.50 ఏర్పాటు చేయాలని కోరారు. చెప్పుల స్టాండ్, కారు పార్కింగ్ పాటలను రద్దు చేసి భక్తులకు ఉచితంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కిసాన్ మోర్చ డ్రెయినేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చెంపాటి శివ రామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, నాయకులు పోతురాజు సురేష్, పోలిశెట్టి గంగ, కె.నాగభూషణం, యెనుముల సుబ్బారావు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు



కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఫెలో టీచర్' విభాగంలో రావులపాలెం మండలం ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించి సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించే కార్యక్రమంలో ఆయన సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తక రచయితగా, 6 నుంచి పదో తరగతి వరకూ పాఠ్య పుస్తకాల తయారీలో రచయితగా, అనువాదకుడిగా, ఎడిటర్‌గా కృష్ణారెడ్డి సేవలందించారు. హెచ్‌ఎంగా కృష్ణారెడ్డి గతంలో పనిచేసిన జగన్నాథగిరి, గంటి, ప్రస్తుతం పనిచేస్తున్న ఈతకోట పాఠశాలల్లో విద్యార్థులకు తాను స్వయంగా, దాతల సహకారంతో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ వంటి అవస్థాపన సౌకర్యాలు, పాఠశాలలకు ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. కృష్ణారెడ్డి ఎప్పుడూ అవార్డుల కోసం దరఖాస్తు చేయలేదు. ఆయనను వెతుక్కుటూ అవార్డులు వచ్చాయి.

నియోజకవర్గ ముస్లిం నూతన కార్యవర్గం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలో ఆదివారం రాజోలు నియోజకవర్గ ముస్లిం సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా ఎండీ అబ్దుల్ హమీద్, షేక్ జిలానీ, అధ్యక్షుడిగా మహబూబ్ జానీ, ఉపాధ్యక్షుడిగా ఎండీ కిషోర్ మొహిద్దీన్, ఎస్‌కె కబీర్, సెక్రటరీలుగా షేక్ బాజీ, అబ్దుల్ మునీర్, సయ్యద్ రోషన్ ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా 24 మందికి చోటు కల్పించారు.

త్వరితగతిన మాదిగలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

అలమూరు: సుప్రీంకోర్టు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం సలహా మేరకు రాష్ట్రంలో త్వరితగతిన మాదిగ రిజర్వేషన్లను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ మాదిగ అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో ఆదివారం మాదిగల ఆత్మగౌరవ స్థూప ఆవిష్కరణ జరిగింది. గ్రామ ఎమ్మార్పీఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది నాయకులు విచ్చేసి మాదిగల ఆత్మగౌరవ నినాదం ఆవశ్యకతను వివరించారు. మాదిగ రిజర్వేషన్ల కోసం మూడు దశాబ్దాల పోరాటం ఫలించడంపై పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాదిగల జనసందోహం మధ్య ఆత్మగౌరవ స్థూపం ఆవిష్కరించారు.

వెంకన్నకు హైకోర్టు జడ్జి పూజలు



హైకోర్టు జడ్జికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం హైకోర్టు జడ్జి కె.మహేశ్వరరావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయనకు ఆలయ ఈఓ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అలాగే కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటం అందజేశారు.

వనసమారాధనలతో ఐక్యత

అంబాజీపేట: కార్తిక వనసమారాధనలతో స్నేహ భావం, ఐక్యత పెంపొందుతాయని పలువురు మహిళలు పేర్కొన్నారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మాచవరం శివారు పోతాయిలంకలో మట్టపర్తివారిపాలెంలోని భక్తాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణం, కొబ్బరితోటల్లో ఆదివారం భారీ వనసమారాధన నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు, కార్తిక దామోదర స్వామికి, సత్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు, యువకులు వనసమారాధనలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు.

గురుశుశ్రూషతోనే భగవత్‌ధామం

అయినవిల్లి: గురుశుశ్రూషతోనే భక్తులు దివ్యదేహంతో భగవత్‌ధామం చేరుకోవచ్చని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో శ్రీకృష్ణునికి విశేష పూజలు చేశారు. స్వామికి ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో పది మంది భక్తులు శ్రీకృష్ణుని నామ దీక్షను స్వీకరించారు. స్వామి లీలామృతాన్ని పారాయణ చేశారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.


ఘనంగా కార్తిక వన సమారాధన



ఎల్.గన్నవరంలో విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న యాదవ సంఘ నాయకులు

పి.గన్నవరం: నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్.గన్నవరం గ్రామంలోని డొక్కా నాథ్‌బాబు కొబ్బరితోటలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు నాగళ్ల నాగరాజు మాట్లాడుతూ యాదవులంతా ఐకమత్యంతో ఉండాలని అన్నారు. నాలుగు మండలాలకు చెందిన 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యాదవ సంఘాల నాయకులను సత్కరించారు. చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. కార్యక్రమాల్లో సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

'సింహానికి జలుబు చేసింది' పుస్తకావిష్కరణ



మామిడికుదురులో పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

మామిడికుదురు: ఉపాధ్యాయులు కొక్కెరగడ్డ వెంకటలక్ష్మణరావు రచించిన 'సింహానికి జలుబు చేసింది' పుస్తకావిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. సహృదయ సాహితీ సకల కళా వేదిక ఆధ్వర్యంలో మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈఓ ఎస్.లక్ష్మీనారాయణ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజలను ఆలోచింప చేసే రచనలు చేస్తున్నారంటూ కవులను అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బావరాజు సూర్యప్రకాశరావు అభినందించారు. కార్యక్రమంలో కళా వేదిక అధ్యక్షుడు పెదమల్లు నాగబాబు, ఉపాధ్యక్షుడు చెరుకూరి వెంకటసూర్యనారాయణశర్మ, కార్యదర్శి ఏడిద కవీంద్ర, సంయుక్త కార్యదర్శి గాదరాడ రవిచంద్ర, కోశాధికారి కందాల వెంకటేశ్వరరావు, గంటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చేతిరాత పోటీల్లో రన్నర్‌గా లక్ష్మశ్రీ



రావులపాలెం: జాతీయ స్థాయిలో పూణేలో విజ్‌కిడ్ కార్నివాల్ ఆధ్వర్యంలో సింబయోసిస్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన కిడ్స్ ప్రైమరీ లీగ్ సెషన్–3 గ్రాండ్ ఫైనల్ హ్యాండ్ రైటింగ్ కాంపిటీషన్ రావులపాలానికి చెందిన కొవ్వూరి లక్ష్మశ్రీ పాల్గొని రన్నర్‌గా నిలిచినట్టు తల్లిదండ్రులు కేవీవీఎస్ సూర్యనారాయణ రెడ్డి, ఆది మహాలక్ష్మి దంపతులు ఆదివారం తెలిపారు. ఇటీవల పూణేలో జరిగిన ఈ పోటీల్లో అండర్–6 నుంచి 8 సంవత్సరాల విభాగంలో లక్ష్మశ్రీ పాల్గొని రన్నర్‌గా నిలిచిందన్నారు. లక్ష్మశ్రీ చదువుతున్న స్థానిక భాష్యం స్కూల్ సిబ్బంది, తదితరులు విద్యార్థిని అభినందించారు. అలాగే ఈ పోటీల్లో రన్నర్‌గా నిలిచి రూ.25 వేల నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నట్టు తెలిపారు

గుండెపోటుతో సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి



యూవీవీ సత్యనారాయణ (ఫైల్)

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పాశర్లపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు యూవీవీ సత్యనారాయణ (58) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య వీరలక్ష్మి, ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మండల మాల మహానాడు అధ్యక్షుడిగా పనిచేశారు. సత్యనారాయణ మృతికి ఆదివారం పలువురు సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, జెడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షుడు బుచ్చిబాబు, సర్పంచ్ కొనుకు ప్రేమ జ్యోతి తదితరులు సంతాపం తెలిపారు.

విశ్వేశ్వరునికి భస్మాభిషేకం



అంబాజీపేట: మాచవరం శివారు కోశివారి అగ్రహారంలో వేంచేసిన భువనేశ్వరి సమేత విశ్వేశ్వరునికి ఆదివారం భస్మాభిషేకం (విభూతి) జరిగింది. ఆలయ అర్చకులు ధూళిపాల ప్రవీణ్ కుమార్, సహాయ అర్చకులు గన్నవరపు సుభద్రరావు ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేకంగా భస్మాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అపమృత్యు దోషం, అనారోగ్య దోష నివారణార్థం విశ్వేశ్వర స్వామికి మహా మృత్యుంజయ సంపుటిగా భస్మాభిషేకం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తూరి సుబ్రహ్మణ్యం, కామేశ్వరి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన కల్వర్టుకు శంకుస్థాపన

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో శిథిల స్థితికి చేరిన కల్వర్టు స్థానే రూ.32 లక్షలతో కొత్త కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. చింతలపల్లి వంతెన, మలికిపురం మెయిన్ రహదారి మధ్యలో ఈ శిథిల కల్వర్టు ఉంది. సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జి.పెదకాపు, చెల్లుబోయిన హరికృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.